క్లుప్తంగా

ఓటు అడిగే హక్కు కూటమి నేతలకు లేదు

ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరు గౌతమ్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కోల్పోయిందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరు గౌతమ్‌రెడ్డి విమర్శించారు. కృష్ణా గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పరిచయ కార్యక్రమం ఇబ్రహీంపట్నం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం జరిగింది. సమావేశంలో గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు బాధ్యతగా ఓటర్ నమోదుపై దృష్టి పెట్టాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, వైఎస్సార్ సీపీ ఇబ్రహీంపట్నం మండల, కొండపల్లి పట్టణ కన్వీనర్‌లు బొంతా సాంబశివరావు, మిక్కిలి శరభయ్య, వివిధ విభాగాల నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, వాహెద్, పచ్చిగోళ్ల పండు, పోరంకి పద్మావతి, నాగరాజకుమారి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బతుకమ్మ నిమజ్జనం



గంపలగూడెం: మండలంలోని ఊటుకూరులో బతుకమ్మ నిమజ్జన కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో కొసాగింది. గ్రామంలోని రామిశెట్టి వేణుగోపాలరావు కల్యాణ మండపంలో దసరా పండుగ సందర్భంగా సంప్రదాయబద్ధంగా బతుకమ్మను నెలకొల్పారు. 11 రోజులు విశేష పూజలు చేసిన అనంతరం సోమవారం నిమజ్జనం చేశారు. వివిధ రకాల పూలతో చేసిన పేర్పులను చేతబూని బతుకమ్మ వెంట భక్తులు రాగా అట్టహాసంగా ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు. గంపలగూడెం బస్టాఫ్ సెంటర్, రావిచెట్టు సమీపంలో, ఎస్సీ బీసీ కాలనీ, తూర్పుదళితవాడల్లో నెలకొల్పిన బతుకమ్మకు వైభవంగా పూజలు చేశారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు



ఆగిరిపల్లి: అడవినెక్కలం పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 40 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి జరిమానాలు విధించారు. మొత్తం 3013 సర్వీసులు తనిఖీ చేయగా 184 సర్వీసులకు రూ.5.30 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ, నూజివీడు రూరల్ డీఈఈ ఎం.పోతురాజు, అడవినెక్కలం ఏఈ ఎం.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల ఆందోళన



తిరువూరు: తమ సేవలను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు సోమవారం ఆందోళన చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు జీవో నెం.114 ప్రకారం కాంట్రాక్టు అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల 19 వరకు నిరసన వ్యక్తం చేస్తామని అధ్యాపకులు తెలిపారు.

20న మధుమేహ రోగుల వైద్య శిబిరం

తిరువూరు: ఈ నెల 20న తిరువూరులో మధుమేహ రోగుల ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి జరిగే ఈ శిబిరంలో మధుమేహం, రక్తపోటు, మూర్ఛవ్యాధిగ్రస్తులను పరీక్షించి అవసరమైన మందులు ఇస్తామని తెలిపారు. ఫ్యాక్టరీ సెంటర్లో ఉదయం 5 గంటల నుంచి ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మిడ్ డే మీల్స్ నిర్వాహకులపై వేధింపులు

- తప్పుకోవాలని టీడీపీ నేతల హుకుం
- కప్పం అయినా కట్టాలంటూ ఆదేశాలు
- ఆందోళనలో నిర్వాహకులు



మైలవరం ప్రభుత్వ బాలికల హైస్కూల్లో వంట ఏజెన్సీ నిర్వాహకులు

మైలవరం: వంట ఏజెన్సీ నిర్వాహకులను అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారు. నువ్వు మా పార్టీ కాదు, నువ్వు వంట ఏజెన్సీ నుంచి తప్పుకోవాల్సిందేనని, లేకుంటే ఊరుకునేది లేదని భయపెడుతున్నారని ఏజన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. కంటిన్యూ చేయాలంటే లక్ష రూపాయలు ఇచ్చుకోవాల్సిందేనని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు మధ్యాహ్న భోజన పథకం (మిడ్ డే మీల్స్) కార్మికులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక ఎన్నో సంవత్సరాలుగా పిల్లలకు భోజనాన్ని వండి పెడుతున్నామని, ఈ వృత్తిని నమ్ముకుని ఉన్నామని, ఇప్పటికిప్పుడు తప్పుకోమంటే ఎలా అని, చావనైనా చస్తాము కానీ తప్పుకునేది లేదంటూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మైలవరం మండలంలో 49 మంది మధ్యాహ్న భోజన కార్మికులు వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2003 సంవత్సరం నుంచి భోజనం అందిస్తున్నారు. వీరికి మొదట్లో ఎలాంటి జీతభత్యాలు లేవు, సీఐటీయూ నాయకులు చేసిన పోరాట ఫలితంగా గత ఐదు సంవత్సరాల నుంచి నెలకు రూ.3 వేలు వేతనంగా ఇస్తున్నారు. వీరు ప్రభుత్వం మెనూ ప్రకారం ప్రైమరీ పాఠశాలల్లోని ఒక్కొ విద్యార్థికి రూ.5.88 చొప్పున, యూపీ పాఠశాల, హైస్కూల్ విద్యార్థులు ఒక్కొక్కరికీ రూ.8,57 చొప్పున భోజనం అందిస్తున్నారు. వీరికి 5,6 నెలలకు ఒకసారి బిల్లులు వస్తాయి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి సుమారు రూ,60 వేల నుంచి రూ.80 వేల వరకు నెలకు ఖర్చవుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులను తొలగించాలని అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారు. మైలవరంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న వంట నిర్వాహకులు తప్పుకోవాల్సిందేనంటూ అధికార పార్టీ నాయకులు సోమవారం హల్చల్ చేయడం గమనార్హం. సమాచారం అందుకున్న సీఐటీయూ నాయకులు భోజన కార్మికులకు అండగా నిలవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

టీడీపీ నాయకులు భయపెడుతున్నారు



గత మూడు నెలలుగా టీడీపీ నాయకులు తప్పుకోమని బెదిరిస్తున్నారు. 21 సంవత్సరాలుగా సకాలంలో బిల్లులు రాకపోయినా అప్పులు చేసి పిల్లలకు భోజనాన్ని అందిస్తున్నాం. ఇప్పుడు తప్పుకోమంటే ఎలా? మాకు మగ దిక్కులేదు. మరొక వృత్తి చేసుకోలేని పరిస్థితి. బలవంతంగా తప్పిస్తే నన్ను వేధిస్తున్న టీడీపీ నాయకులపై కేసు పెట్టి చావడానికైనా సిద్ధంగా ఉన్నాను.

–నగ్గుర్తి వెంకటరత్నం, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు, మైలవరం

సీఐటీయూ అండగా ఉంటుంది



గత మూడు నెలలుగా మైలవరంలోని పలువురు వంట ఏజెన్సీ నిర్వాహకులను తప్పుకోమంటూ భయపెడుతున్నారు. ఈ బెదిరింపులు తగదు, సీఐటీయూ వారికి అండగా ఉంటుంది. ఇలాంటి విధానాలు తక్షణమే మానుకోవాలి. లేకుంటా పోరాటం చేయక తప్పదు.

సీహెచ్. సుధాకర్, అధ్యక్షుడు, సీఐటీయూ మైలవరం మండలం

విషయాన్ని అధికారులకు తెలియజేస్తాను

గత కొన్ని రోజులుగా ఎవరెవరో వస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా భోజనాన్ని పిల్లలకు అందిస్తున్న వెంకటరత్నంను తీసేయమంటున్నారు. ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళతాను.

పి.శ్రీలక్ష్మి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

మంత్రి కొలుసు పార్థసారధి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని ఓగిరాల తండా, వెంకటాయపాలెం, మిట్టగూడెం, దిగవల్లి, పోతురెడ్డిపల్లిలో రూ.4 కోట్లతో చేపట్టనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణానికి సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాలను అభివృద్ధి పథంలో పయనింపజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణంతో పల్లెల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. జిల్లాలోని 547 పంచాయతీల్లో 1917 పనులకు రూ.121.57 కోట్ల అంచనాతో ఉపాధిహామీ పథకం కింద పనులు చేపట్టడం జరుగుతోందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నూజివీడు: చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ. సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, కుమ్మరిపేట, ధంఢం గార్డెన్, అజరయ్యపేట, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, శ్రీనివాస్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. అలాగే నూతన లైన్ ఏర్పాటు కోసం బంగినపల్లి తోట ప్రాంతంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గంపలగూడెం: మండలంలోని ఊటుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆరు గ్రామాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జగదీష్ తెలిపారు. నూతన విద్యుత్ లైన్‌ల ఏర్పాటు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఊటుకూరు, కొణిజెర్ల, నెమలి, ఉమ్మడదేవరపల్లి, గాదెవారిగూడెం, చింతలనర్వ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

కొండపల్లిలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): దసరా ఉత్సవాల నేపథ్యంలో కొండపల్లి మార్కెట్ సెంటర్ (బొడ్డు రాయి) వద్ద భారీ అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఉత్సవాల్లో పదిరోజుల పాటు వివిధ అలంకరణలో భక్తులకు దర్శమిచ్చిన అమ్మవారు పూజలు అందుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు 11వ రోజు సుమారు 3 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నదానం ఏర్పాటుకు సహకరించిన దాతలకు సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



జెండా ఊరేగిస్తున్న ముస్లింలు, మసీదు కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నంలో గ్యార్మీ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌసేఆజం చిహ్నమైన జెండాను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల నడుమ భక్తిశ్రద్ధలతో ఊరేగింపు చేశారు. పలు వీధుల్లో జరిగిన ఊరేగింపును ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆహ్వానించారు. పండుగ సందర్భంగా ఈ నెల 17న మసీదు వద్ద భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్లు మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ ముస్తఫా తెలిపారు. కోశాధికారి కరీముల్లా, ఉపాధ్యక్షుడు షేక్ దావూద్, షేక్ గోరే, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం షాపులు కేటాయింపు

నూజివీడు: నియోజకవర్గంలోని మద్యం షాపులకు ఏలూరులో లాటరీ తీశారు. మొత్తం 16 షాపులకుగాను 676 దరఖాస్తులు వచ్చాయి. చాట్రాయి మండలంలో రెండు దుకాణాలు ఉండగా కన్నెగంటి లోకేష్, యనమదల వెంకట వేణుగోపాలరావుకు దక్కాయి. ముసునూరు మండలంలో మూడు షాపులుండగా కే వెంకటేశ్వరరావు, పరసా భాస్కరరావు, పటాపంచల జీవనజ్యోతిలకు వచ్చాయి. ఆగిరిపల్లి మండలంలో నాలుగు షాపులుండగా కోనేరు వెంకట సుబ్బారావు, గోనేపల్లి కృష్ణమోహన్‌రావు, లింగమనేని కిషోర్, మండలపు శ్రీనివాసరావులకు దక్కాయి. నూజివీడు మండలంలో నాలుగు షాపులుండగా తుమ్మల రామ్మోహన్‌రావు, బొబ్బా చంద్రకాంత్, మడుపల్లి పూర్ణచంద్రశేఖర్, యాగితల హేమలతలకు వచ్చాయి. నూజివీడు పట్టణంలో పిల్లి సాయికృష్ణ, చలసాని రాజారావు, పున్నమరాజు గోపీ లకు దక్కాయి. సిండికేట్ అయ్యి దుకాణాలకు రూ.2లక్షలు చలానాలు కట్టి దరఖాస్తులు పెట్టిన వారికి ఎవరికీ పెద్దగా షాపులు దక్కలేదు. నూతన మద్యం షాపులు ఈనెల 16 నుంచి అందుబాటులోకి రానున్నాయి.

మైలవరం: నియోజకవర్గంలోని 4 మండలాలకు సంబంధించి 10 మద్యం షాపులు మంజూరయ్యాయి. మైలవరం మండలానికి 4, జి.కొండూరు మండలాలనికి 4 షాపులు, రెడ్డిగూడెం మండలానికి 2 మంజూరయ్యాయి. మైలవరంలో 65 లక్షల శ్లాబ్‌లో జీపీ నాగరాజు, ధనేకుల శ్రీకాంత్, చారుగుండ్ల ప్రసాద్, హైదరాబాద్‌కు చెందిన ఎ.వీరమణి. జి.కొండూరుకుకు చెందిన 65 లక్షల శ్లాబ్‌లో కె.అంజిరెడ్డి, రావిపూడి శ్రీనివాసరావు, పలగాని సూర్య గౌడ్, అంత్యం సుబ్బరాజులు, రెడ్డిగూడెం మండలం రూ.55 లక్షల శ్లాబ్‌లో గుర్రాల శ్రీనివాసరావు, తురక అంకరాజుకు లాటరీలో వచ్చాయి.

దేవాలయాల్లో హుండీ ఆదాయం లెక్కింపు

తిరువూరు: తిరువూరు గ్రూపు దేవాలయాల్లోని హుండీల్లో భక్తులు వేసిన కానుకలను సోమవారం దేవాదాయ శాఖాధికారులు లెక్కించారు. వేంకటాచల స్వామి ఆలయంలో గత 6 నెలలకు రూ.3.42 లక్షలు, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి రూ.58 వేలు, శ్రీచంద్రమౌళీశ్వరాలయానికి రూ.41 వేలు హుండీల ద్వారా ఆదాయం లభించింది. తిరువూరు గ్రూపు దేవాలయాల మేనేజరు ప్రసాద్, గన్నవరం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ పర్యవేక్షించారు.

సాయిబాబాకు న్యాయవాదుల నివాళి



మైలవరం బార్ అసోసియేషన్ హాల్‌లో సాయిబాబాకు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మైలవరం: ప్రజా కవి, మేధావి, ప్రఖ్యాత మానవ హక్కుల యోధుడు జీఎన్ సాయిబాబా అని సీనియర్ న్యాయవాది పీవీ శేషగిరిరావు అన్నారు. మైలవరం బార్ అసోసియేషన్ సాయిబాబాకు స్థానిక న్యాయవాదులు సోమవారం నివాళులర్పించారు. సాయిబాబా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సదర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబాను ఉపా చట్టం కింద అరెస్టు చేసి 9 సంవత్సరాలు ఎటువంటి బెయిలు లేకుండా నిర్బంధించడం చాలా దారుణమని తెలిపారు. సాయిబాబా తల్లి మరణించినా చివరి చూపులకు కూడా అవకాశం ఇవ్వలేదని చెప్పారు. జైల్లో ఎటువంటి వైద్యం అందించకుండా వికలాంగుడైన ఆయనను మరింత కుంగదీస్తూ 9 నెలల క్రితం జైలు నుంచి విడుదల చేశారన్నారు. సాయిబాబా ఆరోగ్యం మరింత క్షీణించడంతో అకాల మరణం పొందాడన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి ఏడీ ప్రసాద్, వీ.టీ. కిశోర్, మానవ హక్కుల కమిటీ కన్వీనర్ రావూరి రమేష్‌బాబు, న్యాయవాదులు ఎస్‌వీకే సత్యనారాయణరావు, బుద్దవరపు వెంకటరావు, మాదు ఆంజనేయులు, జి. శ్రీనివాసరావు, ఎం. శరత్‌బాబు, ఎమ్ తనూజ్ పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు



రుద్రవరం(రెడ్డిగూడెం, మైలవరం): రెడ్డిగూడెం మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులు రూ.5 కోట్ల వ్యయంతో 10,098 మీటర్ల పొడవున రహదారుల నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. రెడ్డిగూడెం మండలం రుద్రవరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

12 గ్రామాల్లో సిమెంటు రోడ్లు....

విస్సన్నపేట: మండలంలో 12 గ్రామాల్లో అవసరమైన చోట రూ.5 కోట్లు నిధులతో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటుకు ఎమ్మెల్యే సోమవారం కొండపర్వ గ్రామంలో మొదటిగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, కొండపర్వ సర్పంచ్ జి.రమేష్‌బాబు, ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, పీఆర్ డీఈ లక్ష్మణరావు, ఏఈ దేవ సహాయం, ఏపీఓ అనురాధ,ఇన్‌చార్జీ ఈఓపీఆర్డీ హరికృష్ణకుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఏ.కొండూరు: మండలంలోని కంభంపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలోని చెట్లను అనుమతులు లేకుండా నరికించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ నాయక్ కోరారు. కంభంపాడులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ పాఠశాల ప్రాంగణంలో ఉన్న పెద్ద పెద్ద చెట్లను దసరా సెలవుల్లో నరికించారనే విషయం తమ దృష్టికి రావడంతో పాఠశాలకు వెళ్లి పరిశీలించామని చెప్పారు. పెద్ద పెద్ద చెట్లకొమ్మలు, చెట్లు నరికి ఉన్నాయని తెలిపారు. విద్యాశాఖ అధికారుల అనుమతులు లేకుండా చెట్లను నరికించారన్నారు. విద్యార్థుల స్టడీ అవర్స్‌లో చెట్ల కింద కూర్చొని చదువుకుంటూ ఉంటారని నీడ లేకుండా చెట్లను నరకడం సరైందికాదన్నారు. ఈ విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. చెట్లను నరికించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి

నూజివీడు: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఓటరు జాబితాలోని పాత ఓటర్లు కూడా కొత్తగా పట్టభద్రుల ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందేనని నూజివీడు ఇన్‌చార్జి తహసీల్దార్ బి.సుబ్బారావు సోమవారం తెలిపారు. గతంలోని పట్టభద్రుల ఓటరు జాబితాలోని వారు తాజా ఓటరుగా నమోదు చేసుకుంటేనే రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటు హక్కు పొందుతారని స్పష్టం చేశారు. ఏదైనా డిగ్రీ 2021 నవంబరు ఒకటో తేదీ నాటికి పూర్తి చేసి ఉండాలన్నారు. డిగ్రీనే కాకుండా ఏదైనా తత్సమాన అర్హత ఉన్న వారు కూడా ఓటరుగా నమోదుకు అర్హులేనన్నారు. దరఖాస్తు ఫారాలు నియోజకవర్గంలోని అన్ని తహసీల్దారు కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దరఖాస్తును పూర్తి చేసి డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీపై గెజిటెడ్ ర్యాంకు అధికారి సంతకం అటెస్టెడ్ చేయించాలన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, అసెంబ్లీ ఓటరు గుర్తింపు కార్డు నకళ్లను జతజేసి ఆయా కార్యాలయాల్లో అందజేయాలని పేర్కొన్నారు. నవంబరు ఆరో తేదీలోగా అర్హులైన ప్రతి ఒక్కరూ కూడా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

భక్తులకు అన్న సమారాధన

విస్సన్నపేట: స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న కనకదుర్గా అమ్మవారి దేవస్థానం వద్ద దసరా పండుగ ముగింపు సందర్భంగా భక్తుల సహకారంతో అన్న సమారాధన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైల్వే కార్మికులకు భద్రత కల్పించాలి

రైల్వే కార్మిక సంఘాల నేతలు



డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్మిక సంఘాల నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే కార్మికులకు భద్రత కల్పించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. విజయవాడ డివిజన్ లోకో పైలట్ ఎబినేజర్ హత్యను నిరసిస్తు పలు రైల్వే కార్మిక సంఘాలు సోమవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లోని క్రూ బుకింగ్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. తొలుత ప్రాణాలు కోల్పోయిన లోకో పైలట్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్మిక సంఘాల నేతలు ప్రదర్శనగా డీఆర్ఎం కార్యాలయం చేరుకుని ఇటువంటి ఘటనలు పునావృతం కాకుండా పని ప్రదేశాలలో ఉద్యోగులకు భద్రత కల్పించాల్సిందిగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏఐఎల్ఆర్ఎస్ఏ విజయవాడ డివిజన్ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాత్రుళ్లు స్టేషన్ అవుటర్లు, యార్డ్‌లలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, పోలీసు బీటు పెంచాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్ కె.రమేష్, ఎంప్లాయీస్ సంఘ్ ఏజీఎం వై.నాగేంద్రబాబు, మజ్దూర్ యూనియన్ రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి ఎం.క్రాంతి కుమార్, సీఐటీయూ నాయకుడు వి.వి.ఎల్ నరసింహులు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ఆగిరిపల్లి: జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకి చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చూపించి తృతీయ స్థానం సాధించారు. ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఎల్.మున్ని, హేమ నాగ త్రివేణి తృతీయ స్థానం సాధించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత అభినందించారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఊరేగింపు

చాట్రాయి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలోని కోటపాడు పాత రామాలయంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారిని సోమవారం గ్రామంలో ఊరేగించారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ప్రతి ఇంటా అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు బుధవారం నుంచి జరుగుతుందని ఆలయ ఈవో కెఎస్.రామరావు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి మహా మండపం ఆరో అంతస్తులో జరిగే లెక్కింపులో ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొనున్నారని తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే కానుకల లెక్కింపుతో దసరా ఆదాయం వెల్లడవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆవిష్కరణలపై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించాలని సీనియర్ డేటాబేస్ ఎనలిస్ట్ అండ్ ఇంజినీర్ రామకిరణ్‌గుప్తా అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో సోమవారం డేటాబేస్ రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలు – సమస్యలుపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. రామకిరణ్‌గుప్తా మాట్లాడుతూ డేటాబేస్ రంగంలో అనేక నూతన అంశాలు ముందుకు వస్తున్నాయన్నారు. అందులో భాగంగా మంగోడిబీ అట్లాస్ సాఫ్ట్‌వేర్‌తో వ్యాపార రంగంలో నిర్ణయాలు తీసుకోవటానికి అవకాశముంటుందన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ నేతలు

పటమట(విజయవాడతూర్పు): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం బెంజిసర్కిల్ వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ తూర్పు సిటీ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ భవన, ఇతర నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు పని చేయించి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేసి కార్మికులకు పని కల్పించాలని, వరదల కారణంగా ఉపాధి కోల్పోయిన కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా భృతి చెల్లించాలని ఆందోళన చేశారు. నిర్మాణ రంగంలోని 36 రకాల వృత్తుల్లో రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది, ఎన్టీఆర్ జిల్లాలో 1.50 లక్షల మంది పని చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనా అధికార ప్రభుత్వం హామీలను అమలు చేయకపోవడం కార్మికులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికుల డిమాండ్‌లను పరిష్కరించాలని ఈ నెల 15, 16, 17 తేదీల్లో సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో అన్ని పట్టణ మండల కేంద్రాల్లో బహిరంగ సమావేశాలు, ధర్నాలు జనరల్ బాడీ మీటింగ్లు జరుపుతామని, నిర్మాణ కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యేలకు సామూహిక వినతిపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు మాజేటి నాగమల్లేశ్వరరావు, డి. దుర్గారావు, రామకృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు